రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి


మంత్రి పొన్నంకు వినతి పత్రం ఇస్తున్న రజక గోపి

కాచిగూడ: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేసే విధంగా కృషి చేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గోపి రజక కోరారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రజక కులస్తుల స్థితిగతుల పై... సమాజంలో ఎదుర్కొంటున్న వివక్షత గురించి ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులపై అసెంబ్లీలో మాట్లాడి రజకులకు న్యాయం చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అసెంబ్లీలో రజక కుస్తుల సంక్షేమ పథకాల ప్రస్తావనతో పాటు ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్ని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని అసెంబ్లీలో మాట్లాడిన వీడియోను మంత్రికి అందజేశారు. రజక రిజర్వేషన్ సమితి అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగ్‌రావు, బేగంపేట నర్సింహ, కొండ్రాతి రమేష్ పాల్గొన్నారు.

తునికాకు యూనిట్లకు టెండర్లు నిర్వహించాలి

రాయల్టీ రద్దుకు తీసుకొచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలి


మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: తునికాకు యూనిట్లకు టెండర్స్ నిర్వహించాలని, రాయల్టీని రద్దు చేసేందుకు తీసుకొచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని, 50 ఆకుల కట్టకు రూ. 5 ప్రకారం నిర్ణయించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న డిమాండ్ చేశారు. ఆ మేరకు మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఏజెన్సీలో నివసిస్తున్న పేద ప్రజలకు ప్రధానంగా ఆదివాసీలుకు తునికాకు సేకరణతో వచ్చే ఆధాయం ప్రధాన వనరుగా ఉందని వేలాది మంది ఆకు సేకరణలో పాల్గొంటారని, ఆకు సేకరణ ద్వారా ప్రభుత్వానికి కూడా రాయల్టీ రూపంలో ఆదాయం సమకూరుతుందని తెలిపారు. సీజన్ దాటిపోతున్నా 2024 సంవత్సరానికి టెండర్లు నిర్వహించలేదని తెలిపారు. ఆలస్యం అయినందున ఆకు సేకరణకు వాతావరణం అనుకూలించదన్నారు. వెంటనే కాంట్రాక్టర్లకు టెండర్లకు పిలవాలని కోరారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మౌనదీక్ష


మౌన దీక్ష చేస్తున్న ఎన్టీఆర్ అభిమాన సంఘాల నేతలు

కవాడిగూడ: మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే భారతరత్నను ప్రకటించాలని అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్, బీజేపీ సీనియర్ నేత ఎల్.కె.అద్వానీకి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చిరస్మరణీయ సేవలు అందించిన ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు సాయిబాబా ఆధ్వర్యంలో నోటికి నల్ల రిబ్బన్‌లు ధరించి మౌన దీక్ష చేపట్టారు. ఎన్టీఆర్ రాజకీయ సేవలను గుర్తించి ఆయన శతజయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం నేతలు శ్రీపతి సతీష్, నాగు నగేష్, ఎస్ ప్రకాష్, అప్పారావు, హనుమంతరెడ్డి, యాదగిరి రావు, భవాని శ్రీనివాస్, మోహన్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న లిస్సీ జోసెఫ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను అసంఘటిత కార్మికులు విజయవంతం చేయాలని నేషనల్ స్ట్రైక్ బై ఇన్‌ఫార్మల్ సెక్టర్ ఆఫ్ వర్కర్స్ ప్రతినిధి లిస్సీ జోసెఫ్ పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లిస్సీ జోసెఫ్ మాట్లాడుతూ... అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ, నెలకు ఐదు వేల రూపాయల పెన్షన్ కల్పించాలని కోరారు. నాలుగు లేబర్ కోర్డులను రద్దు చేయడంతో పాటు కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రామీణ, పట్టణ శ్రామికులకు సంవత్సరానికి 200 రోజులు ఉపాధిని కల్పించాలని అందు కోసం ప్రత్యేక చట్టం తేవాలన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మీరా సంగమిత్ర, మంజుల, యాన్ జోసెఫ్, ఫలియా పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ ఆందోళన


కాచిగూడలో రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

కాచిగూడ: అఖిల భారత విద్యార్థి పరిషత్ విద్యానగర్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం కాచిగూడలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కల్యాణి, విద్యానగర్ జిల్లా కన్వీనర్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ హరిప్రసాద్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా కాలం గడిపిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకుండా విద్యార్థుల పట్ల మొండి వైఖరిని అవలంభిస్తోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ. 10 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీ రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేసి విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లా ఫోరం కో కన్వీనర్ ఉదయ్, కార్తీక్, వినయ్, నందిని, ప్రణయ్, సాయి తేజ, నవీన్, విష్ణు, ప్రణీత్, హరీష్, సాగర్, శివ, కృష్ణ వర్ధన, చరణ్, సన్నీ, శివ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాయ గానసభ సేవలు అభినందనీయం



సంపుటిని ఆవిష్కరిస్తున్న కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి: కళలు సాహిత్యానికి సాంస్కృతిక సంస్థలు అలంబనలు అని ఆయా సంస్థలలో త్యాగరాయ గానసభ చేస్తున్న సేవలు విశేషమని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అభినందించారు. శ్రీ త్యాగరాయ గానసభ నిర్వహణలో గానసభలోని లలిత కళా వేదిక పై డాక్టర్ కె వి రమణ జన్మదినం సందర్భంలో జరుగుతున్న సత్య,సాహిత్య,సంగీత ఇతర కళా ప్రక్రియలలో భాగంగా బుధవారం జరిగిన సాహిత్య కార్యక్రమంలో రఘు శ్రీ రచించిన కవీంద్ర మోక్షకు నిర్మల చేసిన హిందీ అనువాద సంపుటి ఆవిష్కరణ కవి సమ్మేళనం జరిగింది.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. మూల కవితలు భావం మారకుండా హిందీలోకి నిర్మల యధాతథంగా అనువదించి న్యాయం చేశారు అన్నారు. రమణాచారి జన్మదినాన్ని పురస్కరించుకుని గాన సభ బుర్ర కథ వంటి కళాకారులను ఎంకరేజ్ చేయటం ప్రశంసనీయం అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో సినీ దర్శకుడు లక్ష్మణ రేఖ గోపాల కష్ణ, కవి కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో రఘు శ్రీ నిర్వహించగా వెంకట స్వామి, కనకాచారి, బాల గంగాధరయ్య తదితరులు స్వీయ కవితలు చదివారు.

త్వరలో డ్రైనేజీ సమస్యల పరిష్కారం

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: బస్తీలు, కాలనీలలో తలెత్తున్న డ్రైనేజీ సమస్యలను శాస్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు ఆయా ప్రాంతాలలో నూతన డ్రైనేజీ పైపల నిర్మాణ పనులు చేపడుతున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం నల్లకుంట స్ట్రీట్ నంబర్-9లో రూ. 13 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని జల మండలి, జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. అనంతరం ఆ వీధిలో పాదయాత్ర చేపట్టిన ఎమ్మెల్యే స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. జలమండలి అధికారులు, సిబ్బంది, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఎం.భూపతినాథ్, ఎ.రమణానాయుడు, గాలపల్లి శంకర్, కూర నరేందర్, ఇర్ఫాన సుల్తాన, వన్నాడి రమ్య, మూర్తి, ఎం.మురళీయాదవ్, బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు సత్కారం



కాచిగూడ: త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనా రెడ్డిని బీజేపీ సీనియర్ నేత, అఖిల భారత పద్మశాలీ సంఘం ఇంజినీరింగ్ విభాగం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య ఆధ్వర్యంలో బీజేపీ నేతలు త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పి.గోవర్ధన్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కచేరీ

నల్లకుంట: శ్రీ రామగాన సభ ఆధ్వర్యంలో న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వార్షిక ఆరాధనోత్సవాలు సంగీతాభిమానులను ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి. బుధవారం సాయంత్రం శ్రీ రామ గాన సభ కార్యదర్శి కొణికి శ్రీనివాస శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయంలో సంగీత, సాహిత్యాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వీణా విద్వాంసుడు ఆర్.దుర్గారావు, వేణువు కళాకారుడు ఎస్.కె.నాగూర్‌బాబుల యుగళ ద్వయం చే నిర్వహించిన వీణా-వేణువు కచేరీ రాధా పద్మనాభన్ గానం ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. దీనికి మృదంగంపై దుర్గా కుమార్, శ్రీనివాస గోపాలన్, తబలాపై పి.గుణరంజన్, వయోలిన్‌పై అనంత శౌరీ రాజన్ వాద్య సహకారం అందించారు.

ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడికి అభినందన



చిక్కడపల్లి: కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సలహామండలి సభ్యుడిగా నియమితులైన పోతరాజు హరికిషోర్‌ను భారతిసేవా సహకార ఫోరమ్ (బీఎస్ఎస్ఎఫ్) నేతలు బుధవారం సత్కరించారు. చిక్కడపల్లిలోని సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీఎస్ఎస్ఎఫ్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ తదితరులు హరికిషోర్‌ను జ్ఞాపికతో సత్కరించారు.

ఫేస్‌బుక్ ఫేక్ అకౌంట్లతో మళ్లీ మోసాల

- ఫేస్‌బుక్ ఫేక్ అకౌంట్లతో మళ్లీ మోసాలకు తెగబడ్డ సైబర్ కేటుగాళ్లు
- నకిలీ అకౌంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

హిమాయత్‌నగర్: మీ స్నేహితులు, బంధువుల పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్లు క్రియెట్ చేసి అత్యవసరంగా డబ్బులు కావాలంటూ సందేశాలు పంపిస్తూ సైబర్ నేరగాళ్లు మోసాలకు తెగబడ్డారు. పలువురు ప్రముఖుల పేరుతో నకిలీ సోషల్‌మీడియా అకౌంట్లు క్రియేట్ చేసి వారి ఫ్రెండ్స్ లిస్టులో ఉన్న వారికి మెడికల్ ఎమర్జెన్సీ, ఇతర కారణాలు చెబుతూ అత్యవసరంగా డబ్బులు కావాలంటూ ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయాలంటూ మెసేజ్ చేస్తారు. నగరంలో ఇతర మోసాలు పెరుగుతున్నాయని ఈ నకిలీ అకౌంట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలిసులు సూచిస్తున్నారు. తాజాగా సైబర్ కేటుగాళ్లు ఏకంగా రాష్ట్ర ఏసీబీ డీజీ సి.వి.ఆనంద్ ఐపీఎస్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ అకౌంట్లను సృష్టించి మోసాలకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన ఆయన నకిలీ అకౌంట్ అని గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ తరహాలోని మరింత మంది ప్రముఖుల పేర్లతో సైబర్ చీటర్స్ మోసాలకు యత్నిస్తున్నారు. ఎవరి పేరుతో అయినా నకిలీ అకౌంట్ ఉందని తెలిస్తే వెంటనే దాన్ని వారి స్నేహితులతో రిపోర్ట్ చేయిస్తే ఆ అకౌంట్‌ను సంబంధిత సోషల్ మీడియా విభాగం వారు దాన్ని బ్లాక్ చేస్తారని దీన్ని గమనించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి సూచించారు.

అసెంబ్లీ ఆవరణలో
పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్


దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

కవాడిగూడ: తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలేల విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద వెనుకబడిన తరగతుల జాతీయ కమిటీ చైర్మన్ ఎం.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శాంతి దీక్ష చేపట్టారు. మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్‌తో పాటు పలు బీసీ సంఘాల నేతలు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రముఖ సంఘ సంస్కర్తలు పూలే దంపతుల విగ్రహాలను తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసి వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉండే విధంగా చట్టాలు రూపొందించాలన్నారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ..దేశ జనాభాలో సగ భాగం ఉన్న బీసీల ఆరాధ్య దైవం జ్యోతిరావు పూలే, ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకోసం గత కొన్ని సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజాభవన్‌కు మహాత్మా జ్యోతిరావుపూలే పేరు పెట్టడం శుభపరిణామం అన్నారు. తెలంగాణలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీల మనోభావాలను గౌరవించి అసెంబ్లీలో పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిటీ నేతలు కె.అచ్చయ్య, రచ్చ శ్రీనివాస్, వి.దానకర్ణాచారి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే బూత్ అభియాన్


గోల్నాకలో పర్యటిస్తున్న బీజేపీ నేత నందకిషోర్ యాదవ్

కాచిగూడ: బూత్ అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సి.నందకిషోర్ యాదవ్ అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు నందకిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం గోల్నాక డివిజన్ బూత్ నెంబర్ 108 జైస్వాల్ గార్డెన్‌లో బీజేపీ నేతలు పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నరేంద్రమోదీ నేతృత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బూత్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని అన్నారు. బీజేపీ నేతలు రవీందర్ గౌడ్, ఆర్.ప్రవీణ్, శ్రీధర్, జ్యోతి, ఎం.శ్రీనివాస్ రెడ్డి, రామన్ గౌడ్, కె.ఉపేందర్, శ్రీనివాస్, భాస్కర్ యాదవ్, ఎస్.ఎస్.రాము పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత రమాబాయి


లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రమాబాయి అంబేద్కర్ జయంతిలో పాల్గొన్న ప్రముఖులు

కవాడిగూడ: రమాబాయి అంబేద్కర్ జీవతం నేటి తరానికి ఆదర్శమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మాత రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలను గుడిమల్లె వినోద్‌కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాయుద్ధ నౌక గద్దర్ సతీమణి విమలగద్దర్‌కు రామాబాయ్ మెమోరియల్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి జయరాజు, గద్దర్ కూతరు డాక్టర్ వెన్నెల మాట్లాడుతూ... డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే వంటి సామాజిక శాస్త్రవేత్తల త్యాగాలను భావితరాలకు అందించడమే బాధ్యతగా పని చేయాలని సూచించారు. ప్రముఖ అంబేద్కర్‌వాది జేబీ రాజు, సూర్యం, కె.కె.రాజు, బాలకృష్ణ, మంచాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో పనిచేస్తే విజయం తథ్యం

సినీ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్


గుర్రం దయాకర్‌ను సన్మానిస్తున్న బాబుమోహన్ తదితరులు

పంజగుట్ట: చేసే పనిలో ఏకాగ్రత పెడితే తప్పకుండా విజయం సాధిస్తామని సినీ నటుడు, మాజీ మంత్రి బాబుమోహన్ అన్నారు. 60 గంటలు కష్టపడి, 16 వేల 200 బియ్యం గింజలతో ఏడు ఇంచుల పొడవు, ఐదు ఇంచుల వెడల్పు, ఐదు ఇంచుల ఎత్తు ఉన్న అయోధ్య శ్రీరామ మందిరం తయారు చేసిన కళాకారుడు డాక్టర్ గుర్రం దయాకర్‌కు టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, భారత్ వరల్డ్ రికార్డ్స్, యూనివర్సల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ మూడు ప్రపంచ రికార్డు సాధించిన ఆయనకు సన్మాన కార్యక్రమం బుధవారం సోమాజిగూడ ప్రెస్క్లబ్‌లో నిర్వహించారు. జై జవాన్ జై కిసాన్, జై కళాకార్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబుమోహన్ మాట్లాడుతూ... ఎంతో అందంగా రామాలయం తయారు చేయడమే కాకుండా అందులో ఒక లైట్ ఏర్పాటు చేయడం, మందిరంలో సీతారాముల వారి చిత్రపటాలు ఏర్పాటు చెయ్యడం సాక్షాత్తూ శ్రీరాముల వారు పూనితేనే ఇలాంటివి తయారు చేస్తారన్నారు. గతంలోనూ గుర్రం దయాకర్ బియ్యపు గింజలతో చార్మినార్, బుద్ధుడు, తెలంగాణ తల్లి, అర్ధనారీశ్వరుడు, కాకతీయుల కోట తయారు చేశారని గుర్తుచేశారు. జాతీయ, అంతర్జాతీయ, ప్రపంచ రికార్డ్స్ ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.వి.రమణారావు, దైవజ్ఞశర్మ, వరల్డ్ రికార్డ్స్ అడ్వైజరీ కమిటీ ఉపాధ్యక్షురాలు చక్కిలం స్వప్న శ్రీనివాస్, రజిత పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: కేంద్రంలో బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని అభివృద్ధి బాటలో పయనించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ సూచించారు. ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు బూత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కాచిగూడ డివిజన్‌లోని పలు బూత్‌లలో ఆమె పర్యటించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కరపత్రాలను పంపిణీ చేస్తూ ఇంటింటికీ ప్రచారం చేశారు. బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చొద్దని వినతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చవద్దని కోరుతూ తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర అభివృద్ధి సంస్థ నేతలు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేయాలని అనంతరామన్ కమిషన్, రోషన్ కమిషన్ మరెన్నో కమిటీలు ప్రాంతాల వారీగా తిరిగి వారి స్థితిగతులపై అధ్యయనం చేసి అమలు చేశారని అన్నారు. వెంటనే కులగణన చేపట్టి రిజర్వేషన్‌లను కాపాడాలని మంత్రిని కోరారు. ఈ విషయంపై ఉప ముఖ్యమంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ, బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాలను సమర్పించామన్నారు. తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు గాలి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అంబటి యాదగిరి, రసకట్ల సురేష్, డోలి ఆనంద్, విజయ్‌కుమార్, అనుమాస సుధాకర్, లక్ష్మీనారాయణ, పల్లెర్ల శంకర్, కుంట ఎల్లయ్య పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు దారుణం

చిక్కడపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత బాల్కసుమన్ అనుచిత వాఖ్యలు చేయడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ... ఒకసారి ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అహంకారంతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అర్థరహితమన్నారు. బాల్కసుమన్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సత్కారం




ముషీరాబాద్: ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను బీఆర్ఎస్ పార్టీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, క్రిస్టియన్ మైనార్టీ ప్రతినిధులు సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి అభినందించారు.

జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధిపై అధికారులతో సమావేశం


వినతిపత్రాన్ని సమర్పించిన దృశ్యం

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్ కొంతకాలంగా నిలువ ఉంచిన బతుకమ్మ చీరలు తొలగించినందుకు జవహర్ నగర్ ఎస్సార్టీ అసోసియేషన్, స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, బీజేవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్‌కు జవహర్‌నగర్ ఎస్సార్టీ, జవహర్ నగర్ వ్యాయామశాల, ఆటస్థలం, కల్యాణమంటపం పరిరక్షణ కమిటీ ప్రతినిధులు నర్మెట్ట మల్లేష్, మారిశెట్టి నర్సింగరావు, గుండు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జవహర్‌నగర్‌లో ఎ.వినయకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ చేసిన ఫిర్యాదు మేరకు బతుకమ్మ చీరలను అక్కడి నుంచి సంబంధిత అధికారులు తరలించారు. కమిటీ ప్రతినిధులకు కృష్ణ, దేవయ్య, మహేందర్, కెప్టెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్‌లో గుర్తుతెలియని మహిళ మృతి


గుర్తుతెలియని మహిళ

కాచిగూడ: గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగుచూసింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య సమాచారం మేరకు... గుర్తుతెలియని మహిళ(60) ఎంఎంటీఎస్ రైలు కోచ్‌లో మరణించి ఉండటాన్ని గుర్తించారు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎండిన చెట్టును తొలగించరూ...



ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ అచ్చుతరెడ్డి మార్గ్‌లో పూర్తిగా ఎండిపోయి ఏక్షణంలోనైనా పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న వృక్షాన్ని తొలగించాలని స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులను కోరుతున్నారు. నెలల క్రితం ఎండిపోయిన చెట్టును తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు మొరపెట్టుకుంటున్న వారు స్పందించడం లేదని ఆరోపించారు. వేర్లు మొత్తం కుళ్లిపోయి పూర్తిగా ఎండిపోయి భారీ గాలులు వీచినప్పుడు చెట్టు ఊగుతుందని అటుగా వెళ్లే వారిపై ఎప్పుడైనా పడిపోతే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలకు కూడా అంతరాయం దీన్ని వల్ల ఏర్పడుతుందని తెలిపారు. అధికారులు స్పందించి స్థానికులను ఈ ప్రమాదం నుంచి కాపాడాలని కోరుతున్నారు.